# సినిమా బజ్జీ

రంపా



"ఎంత కాదనుకున్నా వాడు మీకన్నకొడుకండీ" దీనాతి దీనంగా భర్త క్షీర సాగరంతో చెప్పింది అమృతవల్లి.

"గొప్ప సత్యం చెప్పావులే. కళ్లు మూసుకుపడుకో" అన్నాడు క్షీరసాగరం.

"పడుకో వడం కాదండీ కళ్లు తేలేసి పడిపోయినా మీరు మాత్రం కరిగేట్లు లేరు" మొహం పక్కకు తిప్పి కొడుకు ఫొటోను చూస్తూ అంది.

"ఛ! మరీ అంత కసాయివాణ్ణి కాదులేవోయ్" అన్నాడు బుజ్జగిస్తూ.

"కాదు. అంతకంటే హీనం" యివ్వాళ అటో ఇటో తేలాల్సిందే అన్న కృత నిశ్చయంతో అంది అమృతవల్లి.

భార్య స్వరంలో మార్పు గమనించాడు క్షీరసాగరం. ఆలోచనలో పడ్డాడు.

"అన్నానని అనుకోకండి. మీరేదో సినిమాల్లో వేషాలు వేశారు. నాలుగు

డబ్బులు కళ్లజూశారు. కానీ జీవితం సినిమా కాదన్న విషయం తెలుసుకోవడం లేదు'' యింకా వుంది. యిది మొదలు మాత్రమే అన్న భావనతో చెప్పింది.

''యిప్పుడేమయిందోయ్'' ఆలోచించకుండా అనేశాడు క్షీరసాగరం.

''ఏమైందేవిటండీ. మీ అహంభావపు పుట్టలో పామై చుట్టు చుట్టుకున్నారు. పైకి తొంగి చూస్తూ బుస కొడుతున్నారు'' అంది.

''ఛ! మరీ నేనంత విషప్పురుగును కాదోయ్'' తగ్గిపోయి అన్నాడు క్షీరసాగరం.

''కాదు అంతకంటే హీనం'' వెంటనే అంది.

గోడమీద పడ్డ నీటిబొట్టు కిందకు జారినట్లు పడిపోయాడు క్షీరసాగరం.

''చాల్లెండి నటన. సినిమాలో వేషాలు లేవని యింట్లో నటించడం మొదలుపెట్టారు''

ఈ విషయం తేల్చకుండా పడిపోతారేం లేవండి అన్న అర్థం వినిపించేట్లు అంది అమృతవల్లి.

గాలికొడితే లేచి నుంచున్న ట్యూబులా వళ్లు సర్దుకుని కూచున్నాడు క్షీరసాగరం.

''ఒక్కగానొక్క కొడుకు ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకుంటానంటున్నాడు. అమ్మాయి తండ్రి ఎప్పుడో ఏదో చేశాడని మనసులో పెట్టుకుని కాదుపో అన్నారు. వాడూ మిమ్మల్ని కాదుపో అన్నాడు''.

''అనబట్టే వాడికాగతి పట్టింది''

''గతి పట్టలే. పెళ్లి ఖర్చు లక్ష సంపాయించుకొస్తే పీటల మీద కూచోబెట్టి అక్షింతలు వేస్తానని మీ బోడి సినిమా డైలాగులు వేశారే. దానికోసం వాడు దేశం కాని దేశం వెళ్లి బజ్జీల బండి నడుపుకుంటున్నాడు'' కన్నీళ్లు తుడుచుకుంటూ అంది అమృతవల్లి.

''ఇంతదాకా ఎందుకాగావు. అప్పుడే నన్ను బోడి అంటే అవునని ఒప్పుకుని ఊరుకునే వాణ్ణిగా''

''ఉన్నమాటని అంత తేలికగా ఒప్పుకునే మనిషైతే ఎప్పుడే బాగుపడే వాళ్లం''

''మరీ నేనంత నీచుణ్ణి కాదోయ్''

''కాదు అంతకంటే హీనం'' అని స్టౌ మీద పాల పొంగు విని లోపలికి వెళ్లింది అమృతవల్లి.

తిరిగి వచ్చేవరకు వామ్మో వాయ్యో అని కేకలు పెడుతూ గిలగిల్లాడుతూ పడుకున్నాడు.

''చాల్లెండి. వెల్లకిలా పడుకుని బ్రేక్‌డాన్సు వేస్తున్నారు. పైనేం కెమేరా వేలాడదీసి లేదు. మూడు 'హీనాలు' పడే వరకు ఎక్కిళ్ళు పడిపోతున్నారు'' అంటూ సోఫాలో కూచుంది.

క్షీరసాగరం పక్షవాతం వచ్చిన వాడిలాగా అలాగే వుండిపోయాడు.

* * *

''ఈ జబ్బేవిటో డాక్టర్లు కూడా చెప్పలేకపోతున్నారు. అంతకుమించి వివరాలు నన్నేం అడక్కండి ప్లీజ్'' అని పెద్ద అక్షరాలతో పోస్టర్ అంటించి క్షీరసాగరం పడుకున్న మంచం వెనక అంటించి పెట్టింది అమృతవల్లి.

పెళ్లి ఖర్చు లక్ష సంపాయించుకొస్తే పీటల మీద కూచోబెట్టి అక్షింతలు వేస్తానని మీ బోడి సినిమా డైలాగులు వేశారే. దాని కోసం వాడు దేశం కాని దేశం వెళ్లి బజ్జీల బండి నడుపుకుంటున్నాడు

పక్కింటి పరిమళాంబ వచ్చింది. ఎందుకిలా అయ్యాడు, ఏమయ్యింది, నిన్నటి దాకా బాగానే వున్నాడుగా అని ప్రశ్నలు వేసింది. అమృతవల్లి పోస్టర్ వైపు వేలు చూపించింది.

''యీ కాయితం మీద రాతలేవిటమ్మా విడ్డూరంగా'' అంది పరిమళాంబ.

''ఆయన్ను చూట్టానికి వచ్చిన వాళ్లకు వివరాలు చెప్పలేక దవడలు నొప్పెడుతుంటే ఈ ఏర్పాటు చేశా పిన్నిగారూ. ఎవరడిగినా వేలు చూపించి ఊరుకుంటున్నా'' అంది అమృతవల్లి.

''నేనెన్నో దాన్నేంటి'' అడిగింది పరిమళాంబ.

''మీదే మొదలు మీరే ఆఖరు'' చెప్పింది అమృతవల్లి వినపడీ వినపడనట్టు.

''చాలా బాగుంది. మావారు పోయినప్పుడు నేనెంత బాధపడ్డానో కదా. ఒక పక్క శవం, ఒకపక్క నా ఏడుపు. ఎలా చచ్చాడని అడిగేవాళ్లు. జవాబు చెప్పక పోతే కోపాలు. ఏడ్చైనా చెప్పమ్మా చెప్పైనా ఏడవమ్మా అనే వాళ్లు. చచ్చాననుకో'' అని గడగడా చెప్పింది పరిమళాంబ.

''మా ఆయనలా పడుంటే మీ చచ్చు ముచ్చట్లేవిటి పిన్నిగారూ'' అంది అమృతవల్లి ఏదో పని చూసుకుంటూ.

''అయ్యో! అయ్యో! అలా అనుకుంటున్నావా. నీకా యిబ్బంది రాకుండా వుండాలని చెప్పానమ్మా. నేను నీలాగే అప్పుడో కాయితం ముక్కరాసి పడేసుంటే ఎంతో బావుండేది కదాని చెప్పానమ్మా అంతే'' అంది పరిమళాంబ.

''సర్లెండి పిన్నిగారూ యిప్పుడు ట్రిక్కు తెలిసిందిగా'' అంది అమృతవల్లి.

''అదేంటమ్మా! యిప్పటికిప్పుడు నాకో మొగుడొచ్చి, వాడు చచ్చి, నేను ఏడ్చి కాయితం ముక్క అంటిచ్చొచ్చుంటావా''

''అయ్యో! అది కాదండీ నా ఉద్దేశం. మీలాగ ఎవరూ యిబ్బంది పడకుండా కాపాడడానికి మాకు ఉపయోగపడుతుందని''

''అవునూ అసలు నేనెందుకొచ్చాను ఆ గుర్తొచ్చింది.. మీ బుజ్జబ్బాయి భాషకాని భాష ఊరుకాని ఊర్లో బజ్జిల బండి నడుపుతున్నాడు అదేం ఖర్మమ్మా'' అంది పరిమళాంబ అమృతవల్లి కళ్లలోకి చూస్తూ.

''ఎవర్ని చూసి ఎవరనుకున్నారో పిన్నిగారూ మీరు'' తడబడకుండా అంది అమృతవల్లి.

''తీర్థయాత్రల బస్సులో బరంపూర్ వెళ్తొస్తుంటే చూశా. పెళ్లీడొచ్చిన పిల్లాడు దేశాల మీద పడ్డాడనుకున్నా'' అంది పరిమళాంబ.

''అనుకుని ఏం చేశారేంటి''

''మాట్లాడించా''

''ఏభాషలో''

''మన తెలుగులోనే''

''జవాబిచ్చాడా''

''గాయ్ దూధ్ దేతీహై ఏ బుజ్జీ బజ్జీ దేతేహై' అని ఏదో వచ్చీరాని తురకంలో మాట్లాడాడు. దాని బట్టే తెలిసిపోయింది. నన్ను గుర్తు పట్టనట్టు వున్నాడని'' అంది.

''అది పట్టుకుని నన్నొచ్చి పట్టుకున్నావన్న మాట'' అని మనసులోనే అనుకుని ''ఎన్ని బజ్జీలు కొన్నారేంటి'' అడిగింది ఆతృతగా అమృతవల్లి.

''బస్సులో అందరికీ కొనిపెట్టా. అసలీ మిరపకాయ బజ్జీల రుచి ప్రపంచమంతా మరిగిందా అనిపిస్తుందమ్మా'' అంది పరిమళాంబ.

''వ్యాపారం బాగా సాగుతుందా పిన్నిగారూ'' అడిగింది అమృతవల్లి.

''అయిదు రూపాయల చిల్లర యివ్వడానికి అయిదొందల కట్టలు తీశాడనుకో. అయినా ఆ అబ్బాయి మన బుజ్జబ్బాయి కాకపోతే నీకెందుకమ్మా అంత ఉబలాటం'' అంది పరిమళాంబ.

''అయితే లక్ష రూపాయలు సంపాయిస్తున్నాడన్న మాట'' అని పడుకున్నాడు క్షీరసాగరం.

భర్త మాట విని కళ్లు తిరిగి పడిపోయింది అమృతవల్లి.

''ఈ లక్షేంటో ఆ బజ్జీలేంటో కూపీ లాగాల్సిందే'' అని పరిమళాంబ పెద్దగా ఆలోచిస్తుంటే కాలు తగిలించి పడేశాడు క్షీరసాగరం. పరిమళాంబ క్షీరసాగరం వళ్లో పడింది.

గట్టిగా పట్టుకున్నాడు క్షీరసాగరం.

అమృతవల్లి కళ్లు తెరిచి చూసింది.

''తీర్థ యాత్రలు తిరిగే మీకు యీ బుద్ధేవిటి పిన్నిగారూ'' అంది అమృతవల్లి.

''ఛీ ఛీ ఛీఛా! నాదేం లేదమ్మా'' అంటూ లేచి వెళ్లిపోయింది పరిమళాంబ.

''ఏంటండీ యిది మీ నటనేమిటి ఆ నటనలో ఈ సహజం ఏంటి'' సూటిగా అడిగింది అమృతవల్లి.

''ఏం లేదు లేవోయ్. మన వాడి సంగతి కూపీ లాగుతానని శపథం చేస్తుంటే వదిలించుకుందామని పట్టుకున్నానంతే'' చెప్పాడు క్షీరసాగరం.

''అదే ఏ చెయ్యో కాలో పట్టుకోవచ్చుగా'' అంది.

''పోన్లేవోయ్. సినిమాల్లో ఎంతమందిని పట్టుకోలేదు. యీ దెబ్బతో మళ్లీ మనింట్లో అడుగుపెట్టదు'' అన్నాడు.

''నేను లేనప్పుడు పెడుతుందేమో'' అంది నవ్వుతూ అమృతవల్లి.

''నీకా భయమే అక్కర్లేదు'' అన్నాడునవ్వుతూ క్షీరసాగరం.

* * *

చేతిమీద కాలిన బొబ్బలతో తిరిగొచ్చాడు బుజ్జబ్బాయి. అలా యింటికొచ్చిన కొడుకుని చూసి బావురుమంది అమృతవల్లి.

''నేనా అమ్మాయిని పెళ్లి చేసుకోలేనేమోనే'' దిగులుగా అన్నాడు బుజ్జబ్బాయి.

''ఆ అమ్మాయే నా ఇంటి కోడలవుతుంది. నువ్వేం బెంగపెట్టుకోకు. మీ నాన్న ఊళ్ళో లేడు కాబట్టి సరిపోయింది'' అంది.

''అవునమ్మా! నాన్నకు నేనున్న ఊరెలా తెలిసింది. అక్కడ దిగాడు'' అడిగాడు బుజ్జబ్బాయి.

''ఊరెళ్లి పొలాలు చూసొస్తానని చెప్పి అక్కడికి చేరాడన్నమాట. పక్కింటి పరిమళాంబను వాకబు చేసుంటాడు. అంతేనో ఆవిడను వెంట తీసికెళ్లారో..'' అంది అమృతవల్లి.

"అవునే! ఆబిడ్సోరోజు నన్ను చూసి నానా యిబ్బంది పెట్టింది. ఓ బజ్జీ కొరికి డబ్బులివ్వకుండా వెళ్లింది" అన్నాడు బుజ్జబ్బాయి.

"ఓసినీ పరిమళాంబా!!" ఆశ్చర్యపోయింది అమృతవల్లి.

* * *

ఆపసోపాలు పడుతూ వచ్చాడు క్షీరసాగరం. సూట్‌కేస్ పక్కనపెట్టి చొక్కా విడుస్తుంటే "పొలాలు అవీ బాగున్నాయా" అడిగింది అమృతవల్లి.

"ఓ బ్రహ్మాండంగా వున్నాయి. తుపానొచ్చి అన్ని పంటలు పాడైనా మన మిరపతోట బాగానే వుందట" అన్నాడు క్షీరసాగరం ఏదో విజయవార్త చెప్పినట్టుగా.

"మిరపకాయ బజ్జీలు కూడా బాగా కాసుంటాయటా" అంది అమృతవల్లి.

"బజ్జీలు కాయడమేంటోయ్" ఖంగుతిని అడిగాడు క్షీరసాగరం.

"బజ్జీల మిరపకాయల పంట బావుందని అన్నా లెండి.. అవునూ బజ్జీల బండి ఎలా వుందటండీ" అడిగింది మళ్లీ.

"మన బండెపుడో అమ్మేశాం కదోయ్. బజ్జీల బండేవిటోయ్. బాంబు పేలేముందు వత్తికి అంటించిన మంటలా బజ్జీ బజ్జీ అంటున్నావేంటోయ్. మధ్యలో టిటిటిటి మొటిక్కాయలేంటోయ్" కందగడ్డలా అయిన మొహంతో అడిగాడు క్షీరసాగరం.

"నాకు తెలుసండీ మీరేవూరు వెళ్లారో. ఎవరితో వెళ్లారో. ఏ పొలం చూసొచ్చారో. పరిమళాంబే దొరికిందా మీకు" అక్కసు వెళ్లబోసింది అమృతవల్లి కళ్లు తుడుచుకుంటూ.

"హమ్మయ్య సీనర్థమయింది. యిందులో పరిమళాంబ పాత్రేం లేదు. నేను మనవాడి బాగోగులు చూడటానికి ఓ గూఢచారిని పెట్టా. వాడిమాట మీద వెళ్లా కొడుకుని చూద్దామనిపించి. పంతం లేదు, పట్టింపులేదు. యింటికి రారా అని తీసుకొద్దామనుకున్నా. వాడక్కడ లేడు. అందుకే తిరిగొచ్చా" అన్నాడు క్షీరసాగరం గుక్క తిప్పుకోకుండా.

"మీ కొడుకు గెలిచే వచ్చాడు. లక్ష రూపాయలు తెచ్చాడు. వేడి వేడి నీళ్లు స్నానం చేసి రండి వివరం చెబుతాను" అంది అమృతవల్లి.

* * *

"మిరపకాయల బజ్జీల వ్యాపారంలో అంత మనీ వుందా. పట్టుమని పదిరోజులు కాకుండానే లక్షరూపాయలు సంపాయించవచ్చా" ఆశ్చర్యంగా అడిగాడు క్షీరసాగరం.

"ఏ వ్యాపారానికైనా కలిసి రావడం అనే పాయింటొకటుంది" అంది అమృతవల్లి.

"సినిమాల్లో వేషాల కోసం ఆస్తులు పోగొట్టుకున్న వాళ్లని ఎందరినో చూశా. కోట్లు పెట్టి సినిమాలు తీసి హుస్సేన్ సాగర్లో దూకిన వాళ్లనూ చూశా.." చెబుతున్నాడు క్షీరసాగరం.

"యింతకీ మీరు చెప్పొచ్చేదేవిటంటే"

"బజ్జీల బండి నడిపి సంవత్సరం తిరక్కుండానే కోటీశ్వరుడైన మిరపబజ్జీల వ్యాపారాన్ని మించింది లేదు అనే సందేశాత్మకమైన చిత్రాన్ని తీస్తా 'మిరపకాయ్ బజ్జీ' అని పేరు పెడతా బక్సాఫీసు బద్దలు చేస్తా" అన్నాడు క్షీరసాగరం.

"కలిసి రావడం అనే పాయింటు మరచిపోతున్నారు" అంది అమృతవల్లి.

"నా కొడుకింత లక్కీ హ్యాండయినప్పుడు ఏ పాయింటుతో నాకేంటి. నాయింటి ముందే బండి పెట్టిస్తా" క్రికెట్ ప్లేయర్ లాగా పిడికిలి బిగించి గాలిలో పంచ్‌లిస్తూ అన్నాడు క్షీరసాగరం.

"ఏమండోయ్ శ్రీవారు ఓ చిన్నమాట" అంది అమృతవల్లి.

"చిన్నా, పెద్దా, పొడుగూ, పొట్టి ఏదైనా చెప్పు వింటా" ఆనందంగా అన్నాడు.

"ఏమండీ- మనవాడి మామగారుమలేసియా సింగపూర్లో పెద్ద వ్యాపారాలు చేస్తున్నాడని చెప్పాడు అదేం లేదండీ నిజంగా, పాపం ఆయన బజ్జీలమ్ముకుని బతుకు గడుపుతున్నాడట" చిన్నగా చెప్పింది అమృతవల్లి.

"టేకిటీజీ. ఆయనెవరైతే మనకేంటి. ఏం చేస్తే మనకేంటి. కలిసొచ్చేది, కలిసి రావాల్సింది మనవాడికి" అన్నాడు క్షీరసాగరం.

"అక్కడెక్కడో కలిసొచ్చింది యిక్కడా రావద్దూ" అంది అమృతవల్లి.

"మీ లేడీసంతే. ప్రతిదానికీ లంగరు వేస్తుంటారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా నేనాగను. అంతే" గట్టిగా చెప్పాడు క్షీరసాగరం.

* * *

"అవునోయ్. మనింటి ముందు బండిపెట్టి యిరవై రోజులైంది. మన లెక్కప్రకారం రెండు లక్షలు రావాలి వచ్చాయంటావా" అడిగాడు క్షీరసాగరం.

"యిదిగోండి మీ రెండు లక్షలు" కొంగుముడిలోంచి తీసి యిచ్చింది అమృతవల్లి.

"నాకు తెలియకడుగుతా, యీ యిరవై రోజులూ చల్లబడ్డ బజ్జీలు పారేయడమే గాని వేడి వేడి సరుకు అమ్మినట్లు లేదు. గాయ్ దూద్ బుజ్జీ బజ్జీ అంటూ పరిమళాంబ తప్పితే బండిముందు ఎవరూ కనిపించలేదు. రెండులక్షలు ఎలా వచ్చాయంటావు" అయోమయంగా అడిగాడు క్షీరసాగరం.

"సినిమా జీవితం అయినప్పుడు జీవితం సినిమా ఎందుకు కాకూడదండీ" అంది అమృతవల్లి.

"నాకేం అర్థం కావట్లేదు" అయోమయంగానే అన్నాడు క్షీరసాగరం.

"అబ్బాయి పెళ్లయింతరువాత మీకన్నీ అర్థమవుతాయి. ముందు వెళ్లి కానీయండి" గట్టిగా అంది అమృతవల్లి.

"సరలాగేక్కానీ" అన్నాడు క్షీరసాగరం.

* * *

పెళ్లి ఘనంగా జరిగింది.

అందరూ జంటను మెచ్చుకున్నారు. పెళ్లి భోజనం బావుందన్నారు. ముఖ్యంగా మిరపకాయ బజ్జీలు చాలా బావున్నాయన్నారు. కొందరు చాటుగా పొట్లం కట్టుకెళ్తామని కూడా చెప్పారు. ఈ రోజుల్లో కట్నం లేకుండా పెళ్లి చేసుకోవడం ఎంత గొప్ప విషయమని చెప్పారు. అత్తవారి గొప్పతనాన్ని మెచ్చుకున్నారు.

కొడుకూ, కోడలూ గదిలోకెళ్లారు.

యింటిముందు కొబ్బరి చెట్టుకి వేలాడుతున్న కొబ్బరికాయను చూస్తూ " ఏ క్షణంలోనైనావూడి పడేట్టుంది. ఏ బట్టతల మీద పడుతుందో ఏంటో" అన్నాడు క్షీరసాగరం.

" ఆ చెట్టుకింద తచ్చాడేది మీరే. మీరే కాస్త జాగ్రత్తగా వుండాలి" అంది అమృతవల్లి.

"అది సరే. నేను సినిమా తీస్తానంటావా" అడిగాడు క్షీరసాగరం నవారు మంచం మీద చుట్ట చుట్టిన కండువాని దిండులాగా పెట్టుకుంటూ.

"ముందు నన్నీ సంగతి చెప్పనీండి. మనబ్బాయి సంపాదించిన పెళ్లిఖర్చు, మన యింటిముందు బండిమీదొచ్చిన డబ్బు అంతా సినిమా డబ్బులేనండీ" అంది అమృతవల్లి.

"సినిమా డబ్బులు మనకెలా వస్తాయోయ్" ఆశ్చర్యంగా అడిగాడు క్షీరసాగరం.

"మీ డబ్బులేనండీ" తాపీగా చెప్పింది.

"నా డబ్బులా. అందుకేనా వియ్యంకుణ్ణి కట్నం అడిగితే బజ్జీలు నోట్లో పెట్టాడు. వామ్మో! వాయ్యో!"

"ఇది జీవితం అండీ. సినిమా కాదు" అంది అమృతవల్లి.

★

